

# రైలు కదిలింది

పొత్తపి సుధేష్ణ

"సాయిబూ, గుర్రం కొంచెం జోరుగా పోనీ! అసలు బయలుదేరిందే ఆలస్యం... ఎంతచెప్పినా టయిముకు వచ్చావు కావు."

"లేదమ్మా! తొందరపడకండి. బండి పావుగంట సేపాగుతుంది స్టేషనులో- రెండు ఫర్లాంగులు మాత్రమే పోవాలి- అదెంత సేపు."

అంటూ, ఒకచేత్తో తన ఎర్రటి తలపాగా సవరించుకుంటూ, గుర్రాన్ని కొరడాతో అదలించాడు.

బండీలో ఉన్న యువతికి అడుగులు ఆమడలుగా కనిపిస్తున్నాయి. బండి వేగం తగ్గినట్లు కనిపించినప్పుడల్లా ఆమె మనస్సు శరవేగంతో పరుగులెత్తింది. క్షణంక్రితం ఆలోచించిన సంగతేమిటని సమీక్షిస్తే, మనస్సు తెలియదంటూ తలపంకించేది. నిమిషానికి పదిసార్లయినా బయటికి తొంగి-చూచేది. ఎంతసేపు గమనించినా- ఆ బాటే, ఆ పొదలే, ఆ నిర్జీవములైన గుట్టలే. తాను కోరింది మాత్రం దూరంగా జరిగింది కామేశ్వరికి. మా ఇల్లేగనక ఈ స్టేషనయినట్టయితే— ఎంత బాగుండేదని— పదేపదే అనుకుంది. కాని ఏం ప్రయోజనం.

గుర్రం పోషకురాలి (కామేశ్వరి) మనస్తత్వాన్ని గుర్తించిందా అన్నట్లు- గ్లప్, గ్లప్, అంటూ గిట్టల చప్పుడుతో సాగుతున్నది. తన ఉద్వేగాన్ని అణచుకోవడానికి కామేశ్వరి చెట్లనీ, పక్షులనీ గమనిస్తూ, పరిసరాల సౌందర్యాన్ని ఆనందించాలని ప్రయత్నించింది. పుట్ట, గుట్ట, ప్రతీదీ పొగలుగ్రక్కుతూ, రొప్పుతో, రొజుతూ పోతున్న ఇంజనునేస్మృతికి తెచ్చాయి, కామేశ్వరికి. బండి సాయిబు యజమానురాలి ఆత్రుతకు కారణము తెలిసికోవా లనుకున్నాడు. ఆమె- నీకెందుకీ అధిక ప్రసంగం- అని ఎక్కడ సణుగుతుందో అని ముక్కుసూటిగా బండి పోనిస్తున్నాడు. ఆమె తన చేతులో ఉన్న ప్యాకెట్టు చూస్తూ "ఆయనకి దీనినయినా తీసుకునేషునత ఉన్నదా?... ఏమో!" అంటూ నిట్టూర్చింది. 14

బండి స్టేషన్ సమీపించినకొలదీ ఆమె హృద్వేగం ఇనుమడించింది. బండి ఎప్పుడాగిందో, తను ఎలా దిగిందో... ప్యాకెట్ తీసుకొన్నదో లేదో- ఈ సంగతులేవీ ఆమెను బాధింపలేదా సమయంలో. జనసమర్దాన్ని చూస్తే, రైలు ప్లాటుఫారంలో ఆగినట్టున్నది. ప్లాటుఫారం అనే నరకాన్ని తరించడానికికూడా అనుమతి పొందాలి. అది లభించడానికి నానా తంటాలూ పడాలి. తన ఆత్రుతలో తనకు దైవతుల్యుడయిన వ్యక్తిని చూడబోతుంటే- ఆ నరక కవాటములగుండా, ఏ అనుమతీ, సహాయమూ లేకుండా దరిచేరవచ్చునని తలచింది కామేశ్వరి. అమాయకురాలు ఆమె హృదయాందోళన టికెట్ కలక్టర్‌కి ఏం తెలుసు?...ఆ క్షణంలో ఆమెను ఆవహించిన ఆవేశాలు నాలుగే- ఆందోళన,- ఆనందం,- ఆత్రుత,- ఉద్వేగం. తను యీ నరక ద్వారము దాటి ఆయన్ని కలుసుకునే వరకూ రైలాగుతుందా? అనే ఆందోళన. ఎన్నో నెలలుగా ఆయన దర్శనార్థమై చేసిన పూజలఫలం నేడు లభించింది అనే ఆనందం. ఆయన్ని చూడగానే, రైలు ఆగిన రెండు మూడు నిమిషాలలో ఏయే తియ్యనిమాటలు పలుకాలి? ఏ యే భావాలు ప్రకటించాలి? అనే ఆత్రుత- ఆయన్ని తాను మళ్లీ ఎన్నాళ్లకోగాని చూడడము తటస్థింపదు. కాబట్టి అలాటి వీడ్కోలులో సహజంగా కనుపించే ఆవేశము- ఆమె చూపులలోను, నడకలోను కనుపించింది.

తన ఉత్సాహోద్వేగాలతో ఆ నరక ద్వారపాలక కర్కశ హృదయములో సానుభూతి ఎందు

కుంటుంది? కామేశ్వరి గబగబ అతన్ని దాటి ప్లాట్‌ఫారముమీదికి ప్రవేశింపబోయింది. అడ్డుగా నిలిచి ప్లాట్‌ఫారమ్ టిక్కెట్టు చూపమన్నాడు. అడావిడిలో తను టిక్కెట్టు కొనుక్కోలేదు. ఖిన్నురాలై, బుకింగ్ ఆఫీసువేపు పరిగెత్తింది. రెండవ గంట గణ, గణ మ్రోగింది- అది కామేశ్వరి హృదయభేరిగ మారింది. గుండెఅదరు ఎక్కువయినది; ఒళ్లంతా చెమట్లుపోస్తున్నాయి. ప్లాట్‌ఫారము టికెట్టు లభించేటప్పటికి కొండ తవ్వినంత ప్రయాసయింది. ఆ రైలు కొండ చిలువంత పొడుగుంటే ఆయన్ని ఎలాగ వెదకి చూడడం!

రైలు పోర్టరు తన డ్యూటీ ప్రకారం మూడవ గంట కొట్టడానికి సిద్ధంగా ఉన్నాడు.

ఇంజను పొట్ట పగిలేటట్టు నీళ్లుతాగి ఎక్కువైన వాటిని కక్కేస్తోంది. డ్రైవరు పచ్చజెండాకోసం వంగి చూస్తున్నాడు. కామేశ్వరి ఒక్కొక్క పెట్టే చూస్తున్నది. మొదటి తరగతి- దాంట్లోనుంచి- ఓ తెల్ల సిపాయి తనవైపు హేళనగా చూశాడు. ముందుకు సాగితే స్త్రీల 'ఇంటర్' తరగతి అని వ్రాసి ఉంది. అక్కడక్కడ వజ్రాల దుద్దులూ, కెంపుల కంకణాలూ చీకటిలో మెరుస్తున్నాయి. తన ఆశ అచ్చట నమ్మయింది. తరువాత నాలుగైదు పెట్టెలు- మూడవ తరగతి. ప్రయాణీకులు తలుపుల నానుకొని క్రిక్కిరిసి నిలుచున్నారు... శతాధిక ముఖాల్లో ఆయన్ని ఎలా కనిపెట్టడం? అన్న నిస్పృహ ఆమె హృదయాన్ని ఆక్రమించి అంతవరకూ వున్న ఆనందోత్సాహాన్ని తరిమేసింది. గంట మోగింది. జనం ఎక్కడవాళ్లు అక్కడ సర్దుకున్నారు. జండా ఎగిరింది- రైలు కదిలింది- కామేశ్వరిలాంటి సామాన్య వ్యక్తులకోసం- వారి హృదయాలలో ఎంత ప్రేమ ఉంటేనే-రైలు తన ప్రయాణాన్ని ఒక్కక్షణంకూడాఆపదు. ప్లాట్‌ఫారంనరకం నుండి ఒక్కొక్క పెట్టె నిష్క్రమించి విముక్తి పొందుతూంటే, అందులోని జనుల వదనాలు క్రొత్త కాంతిని పొందాయి. కామేశ్వరి ఆశ నిరాశ అయినట్టుంది. గార్డుపెట్టెకు ముందుండే కంపార్టుమెంటు తన ముందుకు వచ్చింది...ఒక్కక్షణం ఇద్దరి కళ్లూ కలిసాయి...చేతి వ్రేళ్లు స్పర్శ సుఖాన్ని అనుభవించినాయి- అతన్ని చూచింది కామేశ్వరి. "హైదరాబాదు రణరంగానికి ప్రయాణము" ఇంకా ఏవేవో మాటలు, రైలు గుప్పుల లోను, వర్షం టప్, టప్ లోను, మిళితమైపోయాయి. ప్లాట్‌ఫారం ఖాళీ అయిపోయింది.

......రంగానికి ప్రయాణం...... రణరంగానికి......రణరంగానికి......

జట్కాబండిలో కూర్చున్నా, ఆ మాటలే కామేశ్వరి చెవులలో గింగురుమంటున్నాయి. ఆ మాటలు వెలువడిన మొహం కళ్లలోని కాంతి విహీనత, ఆ పెదవుల స్పందనము- ఆమె కళ్ల యెదుట ప్రత్యక్షమయ్యాయి. తిరిగి జట్కాలోకి ఎలా వచ్చి పడిందో కామేశ్వరికి జ్ఞాపకం లేదు. కలలోకూడా అనుకోని మాటలు వింది. "...రంగానికి, రణరంగానికి ప్రయాణం."

ఈమాటలు తానేమో తప్పుగా వినలేదు కదా అని ప్రశ్నించుకున్నది - తానే యుద్ధభూమిలో ఉన్నట్టూ ఆ బాంబుల శబ్దానికి, ఆ తుపాకుల గడబిడకు మూర్ఛిల్లినట్టూ- భావించింది. తన ప్రియుని కడపటి చూపదేనా?... ఈమాటలు వినడానికేనా, తానన్ని నెలలూ బరువుగా నిరీక్షించింది... పాడురైలు. వెధవప్రొద్దు- వాటికెందుకుండాలి, తనతో సానుభూతి! రైలు ఇంకో నాలుగైదు నిమిషాలు ఆగి ఉంటే? అప్పుడు గోవిందు ఏ సందేశమైనా ఇచ్చి ఉండేవాడేమో. యుద్ధానికి వెళ్ళినవాడు, ఆ కిరాత- రజాకార్ల చేతిలో మరణించక తిరిగి వస్తాడా?... తన బహుమతి కూడా ఆయన్ని చేరడానికి నోచుకోలేదు కాబోలు!... అని పరిపరి విధాల కామేశ్వరి దుఃఖించింది.

బండి సాయిబు ఇదంతా ఒక కంటితో గమనిస్తూనే వున్నాడు. బాగా చీకటి పడింది. తిరుగుదారి కాబట్టి గుర్రం జోరుగా పరుగెడుతోంది. బాటలో గుంటలు పడిన చోట, వాననీళ్లు నిలిచి వున్నాయి. నీళ్లల్లో రోడ్డుదీపాల కాంతి ప్రతిఫలిస్తోంది. "నాజీవితానికి మాత్రం ప్రతిఫలం పొందే మార్గము లేదేమో?"... అని కామేశ్వరి ఊహిస్తూ అప్రయత్నంగా కన్నీళ్లు కార్చడం ప్రారంభించింది.

"ఏడుస్తున్నావా అమ్మా! రైలులో వెళ్ళిన మీవాళ్లు ఏమన్నా మాటలన్నారా?"... అని సాయిబు, బండిలోపలికి చూస్తూ అడిగాడు. సాయిబు కామేశ్వరిని ఆమె చిన్నతనం నుంచీ ఎరుగును. వాళ్ళ యింట్లో ఏ అవసరం వచ్చినా,

సాయిబు బండే కుదిర్చేవారు. కామేశ్వరికి ఒక రకంగా వాడు కుటుంబ స్నేహితుడు.

కాని, ఎంత బతిమాలినా-కామేశ్వరి జవాబు యివ్వలేదు. సంతోషవార్తయితే నలుగురికి చాట వచ్చు-శోకాన్ని ఎప్పుడూ హృదయములో దాచుకోవడమే శ్రేయస్కరము. వెలుపలి వెలుగునందు చీకటినే చూడగలిగింది కామేశ్వరి. ఏ ప్రయాణానికయినా అంతం అనేది ఉండి తీరుతుంది. కామేశ్వరి బండి వాళ్ళ ఇంటిముందు దాగింది.

*    *    *

"సాయిబూ-ఈ రోజు మధ్యాహ్నం స్టేషన్‌కి వెళ్ళాలి. త్వరగా బండి కావాలి-" అని సంతోషంగా అంది కామేశ్వరి.

"విశేషమేమమ్మా?......నీ ముఖం కలకల్లాడుతున్నదే?" అన్న సాయిబు ప్రశ్నకి--"దారిలో చెప్తాను పద" అని కామేశ్వరి సమాధానం చెప్పింది.

మధ్యాహ్నం రెండుగంటలకి రైలు వస్తుంది. కొంచెం ముందుగానే సాయిబు బండి తెచ్చాడు. అందులో ఒకట్రంకు, బెడ్డింగూ వేసి కామేశ్వరి బయలుదేరింది. దారిలో "ఆదివారం నా పెళ్ళి-అందుకే ఈ ప్రయాణం - నువ్వూ వస్తావా, సాయిబూ" అని కామేశ్వరి ఉత్సాహంగా మాట్లాడింది.

సాయిబు ఆమెవైపు ఆశ్చర్యంగా తన పొడుగాటి గడ్డాన్ని నిమురుకుంటూ చూచి, "మరి ఆ రోజు ఎందుకు అలా ఏడ్చావమ్మా" అని అడిగాడు.

"ప్రాణాలు అప్పుడే పోయినట్టయింది-ఆయన చెప్పిన మాటలు వింటుంటే. కానీ ఇవాళ అందిన టెలిగ్రాంలో హైదరాబాదు యుద్ధం అనుకొన్నదానికంటె సులభంగా శీఘ్రంగా ముగిసిందనీ, మన సైనికులు చాల కొద్దిమందే మరణించారనీ ఆయన అన్నారు... మే మిద్దరం అనంతపురం వెళ్తాము. అక్కడనుంచి తిరుపతి ప్రయాణం-అక్కడే వివాహం-నీవు తప్పక రావాలి"-అంటూ ఉద్రేకంతో వాగుతూంటే బండి స్టేషన్ ముందాగింది.

సామాను సాయిబు ప్లాట్‌ఫారంమీద పెట్టాడు. కామేశ్వరికూడా వెళ్ళింది. రైలు ఆగింది.

"కామేశ్వరీ, ఇటు ఇటు" అంటూ గోవిందు కంపార్టుమెంటు వాకిలి తెరిచి బయటికి చూచాడు. కామేశ్వరి మెరుపువలె అందులోకి వెళ్ళింది.

"యుద్ధంలో విజయం పొందినదానికి బహుమాన మేమైనా ఇస్తావా"-అని చిలిపిగా నవ్వుతూ కామేశ్వరిని తన చేతుల్లోకి తీసుకుంటూ అడిగాడు.

"ఇదిగో"-అంటూ గోవిందు భుజముపై తల వాల్చి అతని కళ్ళలోకి చూసింది. గోవిందు తక్షణం ఆమెను హృదయానికి హత్తుకున్నాడు. సాయిబు వాత్సల్యంతో వెలుపలనుంచి చూస్తూ, అద్దె విషయమే మరిచిపోయాడు. కామేశ్వరి అలాగే వుండిపోయింది. రైలు కదిలింది.

---

అతగాడు తర్కశాస్త్రంలో నిధి.అయితేనేం, జీవితమంటే అతడికి విరక్తి కలిగింది. బ్రిడ్జిమీంచి నదిలోకి దూకి చచ్చిపోదామని బయల్దేరాడు తీరా దూకబోయే సమయానికి ఒక పోలీసువాడు చూశాడు. "ఏయ్, ఆత్మహత్య నేరం. నువ్వు అటువంటి పని చెయ్యకూడదు." అని ఆపు చేశాడు.

"ఎందుకు చెయ్యకూడదూ?" అని పండితుడు గద్దించాడు. ఇద్దరూ ఘోరమైన వాదనలోకి దిగారు.

కొన్ని నిముషాల తరవాత ఇద్దరూ నదిలోకి దూకేశారు